బంగారమ్మ కమతం

పెళ్ళైన మరుసటి సాయంత్రానికి, సీతాలుని వెంటతీసుకుని ఊళ్ళోకొచ్చేసాడు భీమయ్య. ఏకాయకీని మాలపల్లిలోకి తీసుకెళ్ళి, గొంతెమ్మ గుడిపక్కనున్న గుడిశల్లోని మూడో గుడిశలోకి తీసికెళ్ళాడు సీతాలుని.

'యిదే మన గుడిశ మా బాబు నాకిచ్చి పోనాది.' అన్నాడు భీమయ్య.

సీతాలు గుడిశ నలుమూలలకి, పైకప్పువైపూ చూసింది. చాలాకాలంగా ఎవరూ ఆ గుడిశలో వుంటూన్నట్లు అనిపించలేదు. పైకప్పు అంతా చింపిరిగుడ్డలా వుంది. బూజు అన్ని మూలల్లోనూ నివాస మేర్పరచుకుంది. చుట్టూ వున్న గజమెత్తు మట్టిగోడలు బెల్లులు వూడి గజ్జికుక్కల్లా వున్నాయి. గుడిశ చిన్నదే అయినా ఒక రోజు బాగుచేస్తేనే గాని వుండటానికి వీల్లేనట్లుంది సీతాలుకంటికి. 'నచ్చలేదేటి?' అన్నాడు భీమయ్య.

'నచ్చకపోడవేటి? యించక్కావుంటేను, బూజూ, దుమ్ము దులిపి గోడలు మెత్తుకుంటే యించక్కుంటాది.' అంది సీతాలు భీమయ్య తృప్తికోసం.

ఊళ్ళైతే, కొత్త పెళ్ళికూతురొచ్చిందని యీపాటికి అమ్మలక్కలు చుట్టూ మూగేవారే. మాలపల్లి కావడంతో ఆడ మగ పనుల్లోకి పోతారు కాబట్టే ఎవరూ రాలేదు సీతాలుని చూడ్డానికి.

'సరేలే. అనకొచ్చి సుబ్బరం చేసుకుందారి బేగినడు మా కాపుకి అగుపడి దండపెట్టుకొద్దారి.' అని వూళ్ళోకి నడిపించాడు సీతాలుని భీమయ్య.

వూళ్ళో కెళ్ళాలంటే, చెరువుగట్టునే నడిచి రామాలయం దగ్గరనుంచి పెద్ద వీధిలోకి మళ్ళాలి. పెద్ద వీధిలో రామాలయానికి కెదురు వున్న లోగిళ్ళ వరుసలో మొదటిలోగిలే. ఆ వూరికి పెద్దలోగిలి, అది రెండు మండువాలలోగిలి. లోగిలి వీధికి చేర్చేవుంది. రెండు పెద్ద గచ్చరుగులు, అరుగుల మీద లావుపాటి స్థంభాలు. సింహంనోరులా రకరకాల నగిషీలతో సింహద్వారం. చూడ్డాని కెంతో గంభీరంగా హుందాగా వుంది.

'యిదే మా కాపు లోగిలి.'

'బాగున్నాది యీ యేలప్పుడు కాపింటికాడుంటడా? పొలవెల్లడూ?'

"కాపంటె మగకాపనుకున్నావేటి? మా కాపు ఆడకాపు."

'ఆడకాపా?' అని సాగతీసింది సీతాలు.

'యేటనుకుంటున్నావేటి? ఆడకాపా అని సాగదీత్తన్నావ్. బంగారమ్మగోరి కమతవంటె వూర్లో మొత్తానికే పెద్ద కమతం. మా ఆడకాపు కబురంపితె,

పెసిడెంటైనా, యమ్మెల్యే గోరైనా ఒచ్చి వాలాల్సిందే. ఎలక్సన్‌లో మా కాపు సందాయిత్తె, యమ్మెల్యేగోరి కళ్ళు తిరిగిపోయేలా యిత్తది.' అని తన కాపు గురించి ఘనంగా చెప్పుకుని, దొడ్డి గుమ్మం దగ్గరికి తీసుకెళ్ళి, 'అమ్మగోరూ అమ్మగోరూ!' అంటూ తలుపు తట్టాడు భీమయ్య.

'ఆఁ' అన్న సమాధానం ఎక్కడో నూతిలోంచి వచ్చినట్లు వినిపించింది. రెండు నిమిషాల్లో దొడ్డి తలుపు తెరచి, లోపలికిరండి అని చెప్పి లోపలికి దారితీసింది బంగారమ్మ.

బంగారమ్మ వెనకే భీమయ్య, భీమయ్య వెనకే సీతాలు లోపలి కెళ్ళారు. ధాన్యం కొట్లను అనుకుని వున్న వరండాలో గొలుసులవుయ్యాల్లో! కూర్చుంది బంగారమ్మ. ఎదురుగావున్న సీతాలుని ఎంతో పరిశీలనగా చూసింది. సీతాలు అందం, వయసు బంగారమ్మ మనసులో ఈర్ష్యను పుట్టించినా, దిగమింగి, పెదవుల చివరనుంచి, 'చిలకలాంటి పెళ్ళాన్ని తెచ్చుకున్నావురా మొత్తానికి' అంది బంగారమ్మ ఎంతో ఆదరంగా.

చెట్టంత భీమయ్య సిగ్గుపడి, మెలికలు తిరిగిపోయాడు. మనసు మాత్రం గర్వంతో రంకెలేసింది. సీతాలు చూపులు బంగారమ్మ మీంచి నేలమీదికివాలి, ఓరగా భీమయ్యను పరకాయించాయి.

బంగారమ్మగారు నిజంగానే బంగారం. ఆమె రంగు బంగారం, ఒళ్ళంతా బంగారం, యిల్లంతా బంగారం, ఆమె గోరి అందంముందు తన అందం ఏపాటిది? అనుకుంది సీతాలు.

"తీసికెళ్ళి మన గొడ్లసావిడి, చింతలదొడ్డి అన్నీ చూపించరా నీ పెళ్లానికి" అంది బంగారమ్మ.

భీమయ్య పెరట్లోకి తీసుకెళ్ళి, చుట్టూ చప్టావున్న పెద్ద నూతిని, దూడలు నీళ్ళు తాగడానికి కట్టిన సిమెంటు కుండీని అవలీలగా యిరవై పశువులకు సరిపోయేట్టు వున్న గొడ్ల సావిడిని, చింతల దొడ్లోని పెద్ద పనసచెట్టుని, చెన్నంగి కొబ్బరి మొక్కల్ని, సంపెంగ చెట్టుని, మల్లెపందిరిని యింకా రకరకాల మొక్కల్ని, సీతాలుకి చూపించాడు. కొత్తగా కాపురానికొచ్చిన భార్యకి సొంత యెస్టేటు చూపిస్తోన్న జమిందారులా దర్జా వెళ్ళబోశాడు భీమయ్య ఆ క్షణంలో.

పక్షులు గూళ్ళకి చేరే వేళయింది. చింతచెట్టు మీద వాలిన పక్షులు కిలకిల్లాడుతున్నాయి. చెట్లమీద కాకుల గోల పెరిగింది. దొడ్డి గుమ్మాన పది గొడు గేదెలను గొడ్ల సావిట్లోకి తోలుకొచ్చాడు చినపాలేరు మరిడయ్య.

భీమయ్య గేదెల్ని చూడగానే 'నీళ్ళట్టినాక కట్టేదారి, కుండికాడకి తోలుకురా' అని పెద్దబాల్చీతో కుండీలోకి నీళ్ళు తోడడం మొదలెట్టాడు. గేదెలు కుండీలో నీళ్ళు తాగి సావిట్లోకి చేరగానే భీమయ్య వెళ్ళి కట్టేశాడు. సీతాలు కొత్తలేకుండా చీర కచ్చాపోసుకుని, దూడముందు శుభ్రం చేసి గడ్డి వేసింది.

ఇంతలో బంగారమ్మ అక్కడికొచ్చి, 'నువ్వు రెండురోజులు పెళ్ళి చేసుకుందు కెడితే వాటొంక సరిగ్గా చూసేవాడే లేకపోయాడ్రా. నువ్వు పాలుపితికి తెచ్చినట్టు,

మరిడయ్య పితికితే యిచ్చేవికావు. నువ్వు వచ్చేశావు యింక నాకు బెంగలేదు.' అంది.

సీతాలు తనపక్క నుండగా, బంగారమ్మ అలా పొగుడుతూ వుంటె 'నే లేకపోతే యీ కమతం ఒక్కరోజు నడవదు. ఏటనుకుంటున్నావో,' అన్నట్టు చూశాడు భీమయ్య సీతాలువైపు.

బంగారమ్మ మెప్పుకి ఉబ్బిపోవడమే భీమయ్యకి తెలుసుకాని, తన గురించి తాను ఆలోచించుకునే తెలివిలేదు. తన తండ్రి ఏడేళ్ళ వయసులో ఆకమతంలో చేర్చి, దారి చూపించాడు. నీ గురించి నాకింక బెంగ లేదన్నట్లు భీమయ్యకు తొమ్మిదేళ్ళు నిండకుండానే కన్ను మూశాడు. ఏడేళ్ళ వయసులో దూడల్ని కాయడానికి ఆ కమతంలోచేరి, రాత్రి మెతుకులు పొద్దున్న, పొద్దున్న మెతుకులు రాత్రి తిని - కాయకష్టంతో కాయాన్ని గట్టిపరచుకుని పాతికేళ్ళవాడయ్యాడు భీమయ్య. కవతం అంతకు రెండింతలయ్యింది. కాని భీమయ్య గుడిశ భీమయ్య తండ్రి నాడెలావుందో యీనాడూ అలా వుంది. అంతేవుంది. ఎటొచ్చి పాడడిపోయింది. అయితే భీమయ్యకి మిగిలింది మాత్రం బంగారమ్మ మెప్పు. అదే భీమయ్యకి తృప్తి.

కాని యిప్పటి పరిస్థితివేరు. భీమయ్య ఇప్పుడు ఒంటరివాడు కాదు సీతాలతనికి తోడుందీనాడు. నిజానికి సీతాలు తనకి బరువు కాదు. సీతాలైనా, యింకో ఆడదైనా, అత్తింటవున్నా పుట్టింటవున్నా వళ్ళు వంచి పనిచేసి పొట్ట నింపుకుంటారు కాని - ఒకళ్ళ కొకళ్ళు బరువుగా వుండరు; ఆ మాలపల్లిలో అయినా యేమాలపల్లిలో అయినా.

కాని సీతాలు వచ్చినా రోజు గడవడానికి కూడా భీమయ్య దగ్గర నా అన్నది ఏమీలేదు. అందుకే నోరు తెరచి బంగారమ్మని అడక్క తప్పలేదు భీమయ్యకి.

'అమ్మగోరా! మరి మేవెల్తావండీ కాసిన్ని బియ్యం యిప్పించండి' అన్నాడు భీమయ్య మొగమాటపడిపోతూ.

బంగారమ్మ నవ్వుకుంది. పాతికేళ్ళ మగాడు, తమ కమతాన్ని యావత్తూ నడిపేవాడు. తనముందు చేతులు జోడించి, ధర్మంకోసం నిలబడ్డం చూస్తే ఆమెకు తృప్తి. అంతే కాని; యిన్నాళ్ళూ వాడు పడినకష్టమే యీ కమతం అంతకు రెండింతలు కావడానికి కారణం అన్న ఆలోచనగాని, తనిచ్చేది ధర్మంకాదు, వాడికి రావలసినదాంట్లో ఓ తృణం అన్న భావంగాని బంగారమ్మకి కలగలేదు. అలాంటి ఆలోచన్లే కలిగితే యీ కమతాలు అంతగా పెరగవు.

'ఇప్పుడు బియ్యం పట్టుకెళ్ళి ఎప్పుడు వండుకుంటారు? అది ఎలా వండుతుంది? కుండా మండా ఏమన్నా వున్నాయా యీపూటకు యిక్కడే తినండిద్దరూ రేపటినుంచి వండుకుందురుగాని లెండి - ముందు గేదెలపాలు పితుకు,' అని భీమయ్య అంగీకారం కోసం ఎదురు చూడకుండానే లోపలికి వెళ్ళి పాలచెంబులు పట్టుకొచ్చి యిచ్చింది బంగారమ్మ.

భీమయ్య పాలు పితకడం అయిపోయాక బంగారమ్మ కొత్త దంపతులిద్దరికీ నూతిచప్టా పక్కనున్న సపోటా చెట్టుకింద ఆకులేసి భోజనాలు వడ్డించింది.

అనుకోని అతిథులు కావడంతో, ఎప్పుడూ అలవాటు లేకపోయినా ఇద్దరికీ వేడన్నమే వడ్డించింది. భీమయ్య, సీతాలు తృప్తిగా భోంచేశారు. ఆకులెత్తి పెంటగోతిలో పారేసి, చేతులు కడుక్కుని, పైమీదనున్న తువ్వాలుతో భీమయ్య, చీర కొంగుతో సీతాలు చేతులు తుడుచుకున్నారు.

బంగారమ్మకి వాళ్ళిద్దరికీ తాంబూలం యిద్దామన్న ఆలోచన కలిగింది. మరు క్షణంలోనే ఎందుకులే లేనిపోనివి అలవాటు చేసి పాడుచెయ్యడం, అనుకుని ఆ ఆలోచన మార్చుకుంది.

ఒక ముతక పంచచాపు, ఆకుపచ్చ రంగు బొద్దంచు నేత చీరపట్టుకొచ్చి, 'యిద్దరూ కట్టుకోండి' అని చెప్పి ఎత్తి వాళ్ళ చేతుల్లో పడేసింది బంగారమ్మ.

ఎలక్ట్రిక్ దీపాల వెలుగులో బంగారమ్మ కట్టుకున్న జరీ అంచు చీర, ఆమె వంటిమీద మరీ అందంగా అగుపించింది సీతాలుకి. అంచు ధగధగ మెరుస్తోంది.

అట్టాంటి చీర యిచ్చుంటె ఇప్పుడే ఓపాలి కట్టుకుని బంగారమ్మగోరి గ్నాపకంగా దాసుకునేదా న్ననుకుంది సీతాలు.

'పెళ్ళి చేసుకుని తను సీతాలుతో రాగానే బట్టలెట్టింది. తనంటె ఎంతభిమానవో బంగారమ్మకి' అనుకున్నాడు భీమయ్య.

బంగారమ్మకి నమస్కరించి, భీమయ్య, సీతాలు 'వెళ్ళొస్తాం' అని చెప్పి బయలుదేరారు. దొడ్డిగుమ్మం దాకా సాగనంపి తలుపు లేసుకుందుకు, వాళ్ళిద్దరూ వెనకే బంగారమ్మా వెళ్ళింది. వాళ్ళిద్దరూ పక్కపక్కల్నే నడుస్తూ వుంటె వాళ్ళ యీడుజోడు చూచి, బంగారమ్మ మనసు ఎందుకో బాధపడింది. భీమయ్య తనచేయి దాటిపోతున్నాడనుకుంది. వాళ్ళని బయటికి పంపి తలుపేసుకుని లోపలికొచ్చి మంచం మీద నడుం వాల్చింది.

వంటరిగా రాత్రివేళ మంచం మీద పడుకున్నపుడు మనసులో అణగివున్న నిజమైన రంగులు కళ్ళముందు కదులుతాయి కామోసు. తన పెళ్ళిరోజు గుర్తుకొచ్చిందామెకి, అప్పటికి తన వయసు పద్దెనిమిది. ఆయన వయసు నలభై; రెండో పెళ్ళివాడు అయినా, ఆస్తి కోసమని యిరవై రెండేళ్ళ తేడా దేముందిలే, వయసు నలభై అయినా, మనిషి ముప్పై లోపువాడిలాగ వుంటాడు - అని తన తండ్రి తనని ఆయనకిచ్చి పెళ్ళి చేసాడు. ఆ పెళ్ళి వెనుకనున్న ఆశ, తన సుఖంకంటె అంత ఆస్థికి పెత్తందారు కావాలన్న తన తండ్రి కోరికేననిపించింది ఆమెకి. తన తండ్రి అంచనాకంటె ముందే ఆయన కన్ను మూసాడు. పోయేవాడు పోక తన కొంక మగనలుసుని వదలిమరీ పోయాడు. వాడి కోసమని, తన తండ్రిని కూడా దూరంగా వుంచి, వాణ్ని ఆ ప్రాంతం యం.ఎల్.ఏ. చిట్టిబాబంతటి వాడిని చెయ్యాలని, తాను ఆడదే అయినా, నోటి మంచితనంతో, చాకచక్యంతో, భీమయ్య ఆసరాతో మగ వాడిలా బండి దొర్లించుకొస్తోంది తను.

తను కాపరాని కొచ్చేసరికి తన వయసు పద్దెనిమిది. భీమయ్య వయసు పదిహేను. అప్పటికింకా కుర్రవాడిగానే వుండేవాడు. తన భర్తతో మహాచేస్తే యేడేళ్ళు కాపురం చేసిందేమోతను. పాతికేళ్ళు నిండకుండానే దాంపత్య జీవితం ఆఖరి పేజీలోకి

వచ్చేసింది. అప్పటికి భీమయ్య నిండుగా తయారయ్యాడు. యిరవై రెండేళ్ళవాడే అయినా పాతికేళ్ళ వాడిలా బలంగా వుండేవాడు. భర్త పోగానే తన తండ్రి తత్వం తనకి బాగా తెలుసు గాబట్టి 'భీమయ్య చూస్తాడులే వ్యవసాయం. అంతకి అవుసరమైతే నీకు కబురు చేస్తాను' అని చెప్పి తండ్రిని తెలివిగా సాగనంపింది తను. యీ తాపత్రయమంతా తన ఒక్కగానొక్క కొడుకుని పైకి తేవాలనీ, వూరికీ, ఆ చుట్టుపక్కల వూళ్ళకీ మోతుబరిని చేయాలని, అందుకే అన్ని కోర్కెలను తుంపుకుని కన్న కడుపుకోసం బతకడం అలవరచుకుంది.

భీమయ్య కూడా ఎంతో నమ్మకంగా, సొంత వ్యవసాయంలా భావించి ఆ కమతాన్ని శక్తికొద్దీ పెంచాడు. బంగారమ్మ కమతానికి భీమయ్య అండచూసి వూళ్ళోవాళ్ళకి కళ్ళుకుట్టేవి.

'ఆడదై వుండీ కమతాన్ని ఎంత సక్కగా నడుపుకొత్తందో చూసావా మావా?' అన్నాడు కూడ, ఓసారి మునసబు – బంగారమ్మ పొలం నుంచి యింటికి వస్తోన్న ధాన్యం బళ్ళను చూసి.

'దాని గొప్పేం వుందయ్యా. ఎప్పుడేనా పొలంలో కదుగెట్టిందా యేవన్నానా? అదుగో ఆ భీమయ్యగాడు దొరకబట్టి నెట్టుకొత్తంది అట్టా తోడు దొరికితే ఎన్ని ఎగసాయాలేనా సెయ్యొచ్చు?' అన్నాడు చౌదరయ్య.

ధాన్యం బళ్ళముందు నడుస్తూ, ఆ మాటలు విన్న భీమయ్య యింటికెళ్ళగానే బంగారమ్మకి వూళ్ళోవాళ్ళనుకుంటూన్న మాటలు చెప్పాడు. అంత క్రితమే బంగారమ్మకి అనోటా అనోటా యిలాంటి మాటలు వినపడుతూనే వున్నాయి.

'పోనీలేరా! ఎవళ్ళేడుపు వాళ్ళది. ఆడదాన్ని, మొగదిక్కులేని దాన్ని నువ్వు నమ్మకంగా దొరికావు నాకు. నామాటమీదే ఈ కమతమంతా నడుస్తోంది. నీ మాటకి నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు. అందుకే వాళ్ళందరికి మనల్ని చూసి ఏడుపు. ఏడిచేవాళ్ళు ఏడుస్తూనే పోతారు. మనం బాగానే వుంటాం.' అని కలుపుగోలుగా మాట్లాడి, భీమయ్యని మరింత సన్నిహితుడ్ని చేసుకుంది బంగారమ్మ. మెప్పు మనిషికి ఏనుగంత బలాన్నిస్తుంది. భీమయ్య మరీ విజృంభించాడు. రాత్రింబగళ్ళు పొలాన్నంటిపట్టుకుని, రకరకాల ఫలసాయాల్నితీయడం మొదలెట్టాడు. చెరకువేసి ఫాక్టరీకి తోలేవాడు, కూరగాయలు పండించి పట్నానికి తోలుకెళ్ళి అమ్మేవాడు. చేలమీద పంటున్న రోజుల్లో పొలంలోనే పడుకునేవాడు. కాళీరోజుల్లో ఎప్పుడో వచ్చి, గొడ్లసావిట్లో గడ్డి పరచుకుని నడుంవాల్చి, కోడి కూయకముందే, మళ్ళీ కూలీలను లేపుకుని పొలం మీది కెళ్ళిపోయేవాడు. దీనికంతకీ ప్రతిఫలం బంగారమ్మ నోటంట ఓ తియ్యని మెప్పు.

భీమయ్య సామర్థ్యం, నిజాయితీ, విశ్వాసం, వీటికితోడు వాడి వయసు చూస్తూవుంటే – ఆమె మనసు కాస్త అల్లరి చేయడం మొదలెట్టింది. వాడు తనకు తోచినట్లు మలచుకుందుకు వీలుగా ఓ మట్టిముద్దలా అనిపించాడు ఆమెకి. దాంతో తనకి తెలియకుండానే మనసులో కోరికలు మొలకెత్తాయి. వేళ్ళు పాకాయి. చివురించాయి. వాడిని అలాకూడ లొంగదీసుకుంటే చచ్చేదాకా తనదగ్గరే

కుక్కలా పడివుంటాడు అనుకుంది. యీ కమతంకోసమే పుట్టినమరలా తనకి వుపయోగపడతాడనిపించిందామెకి.

ఆవేళ వర్షం కురుస్తోంది. వ్యవసాయపు పనుల రద్దీ అంతగా లేని రోజులవి. బాబు పట్నంలో చదువుకుంటున్నాడు. తను వంటరిది; భీమయ్య గొడ్ల సావిట్లో ఓ గొడ్డులా వళ్ళు మరచి నిద్రపోతున్నాడు. బంగారమ్మ మనసుని అదుపులో పెట్టుకోలేకపోయింది. వంటరితనం, వాతావరణం, అందుబాటులో వున్న తన చెప్పుచేతల్లో వున్న మనిషి - అన్నీ కలిసి ఆమెను ముందుకు నడిపించాయి.

తెలివి ఏమూల నుంచో 'చులకనైపోతానేమో. ఊళ్ళో పొక్కితే, ఎవరికోసం యింతచేస్తున్నావో, ఆ పసివాడు తలెత్తుకు తిరగలేడు సుమా' అని వారించింది.

'చుట్టూ వున్న ప్రహరి, యీ లంకంత మండువాలోగిలి దాటి యీ రహస్యం బయటకెలా వెడుతుంది? యిలాంటి లోగిళ్ళలో, యిలాంటివి ఎన్ని జరిగినట్లు తను వినలేదూ. నేనింకా నిగ్రహం గలదాన్ని గాబట్టి, యిన్నాళ్ళు బిగబట్టుకు బతికాను' అనుకుని గొడ్లసావిడివైపు నడిచింది బంగారమ్మ.

'భీమయ్య, భీమయ్య' ముట్టుకో కుండానే లేపింది బంగారమ్మ.

'ఏవండీ!'

'యినప్పెట్టె గదిలో ఏదో చప్పుడౌతోందిరా! ఓసారి వచ్చి చూడు.'

భీమయ్య కర్ర తీసుకుని, బంగారమ్మ వెనకే వెళ్ళి తలుపు గొళ్ళెం తీసి లోపలి కెళ్ళాడు, బంగారమ్మ కూడా లోపలికెళ్ళి లైటు వేసింది.

చుట్టూ చూసి 'ఎవరూ లేరండి?' అన్నాడు భీమయ్య. వాడి మెలి తిరిగిన కండల్ని చూస్తూ మనసులో తీయని వూహాల్ని నెమరువేసుకుంటున్న బంగారమ్మ వాడన్న మాటలికి ఉలిక్కిపడింది. తన మనసులో కోరికని ఎలా చెప్పాలో తెలియక - 'యీ పక్కనున్న పడక గదిలోంచేమోరా నడు చూద్దాం' అంటూ తనే దారితీసింది పడకగదిలోకి.

లైటు వెలుగులో మల్లి పువ్వులాంటి తెల్లని పాన్పు నిలువుటద్దాలూ, చిత్రమైన పక్షిలా పైన ఫేను. తీయని సువాసనలు - ఒక్కక్షణం గొడ్లసావిట్లో బతికే భీమయ్యని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

'దార్లో పడుతున్నాడు' అనుకుంది బంగారమ్మ.

పాన్పువైపే కన్నార్పకుండా చూస్తున్నాడు భీమయ్య. భీమయ్య అలా చూస్తున్నది పాన్పుకింద ఎవరేనానక్కారేమోనని; కాని బంగారమ్మ మాత్రం పాన్పును చూసి భీమయ్య చలించాడనుకుంది. మనసు తన అధీనం తప్పి వురకలు వేస్తోంది. వాడే చొరవచేస్తే బాగుండు ననుకుంది. కాని వాడి వాలకం చూస్తే అంతటివాడిలా అగుపించలేదామెకి. అందుకే తనే తెగించింది. నోరు తెరచి 'ఆ పక్కమీద పడుకోవాలనుందేమిట్రా?' అంది బంగారమ్మ.

భీమయ్య వులిక్కిపడి ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె నిబ్బరంగా అతని కళ్ళలోకి కొంటెగా చూసింది. వాడు తల వంచుకొని 'అదేంటమ్మగోరా! అల్లా అంటారు?' అని బయటికి దారి తీశాడు.

అప్పటికే బయటికి పోయే గుమ్మానికి అడ్డుగా వున్న బంగారమ్మ, 'పడుకోవాలని వుంటే పడుకో, తప్పలేదులే. వానాగాలి – యీాదరంగా వుంది. కష్టపడేవాడు సుఖపడటం తప్పకాదులే.' అంది.

భీమయ్యకి తల దిమ్మెక్కినట్టయింది. ఆ కమతమే ప్రపంచం అనుకుని బతుకుతున్న భీమయ్యకి ప్రపంచంలోని యితర విషయాలు అంత త్వరగా, పూర్తిగా అర్థంగాలేదు.

'లోనెవరూ లేరుకానండ, తలుపేసుకు తొంగొండి నేను సావిట్లోనే తొంగొని వుంటాగా! భయంలేదు తొంగోండి' అని, చరచరా గొడ్లసావిట్లోకి పోయాడు భీమయ్య.

కాసేపు బంగారమ్మ వళ్ళంతా వుడికిపోయింది. మంచం మీద అస్థిమితంగా, అటూ యిటూ దొర్లింది. వాడిని చేతకాని చవట అని తిట్టుకుని, చివరికి సొమ్మసిల్లి నిద్రలోకి జారుకుంది.

తెల్లవారేక వాడిని చూస్తే సిగ్గేసింది బంగారమ్మకి. మనసు స్థిమితపడ్డాక 'వాడు చేతకాని చవటగాబట్టి సరిపోయింది గాని, రాత్రి తను కాలుజారితే; అలుసైపోదును. వాడి అమాయకత్వమే నన్ను కాసింది.' అనుకుంది.

అంతేకాని వాడి నిగ్రహం, నిజాయితీ ఆమెకు తట్టలేదు.

ఏదోవిధంగా, మనసులో మొలకెత్తిన కోరికలను, కన్నకొడుకు మీదున్న మమకారంతోను, కమతాన్ని పెంచాలన్న ఆకాంక్షతోనూ, తుంచేసుకుని రోజులు దొర్లించుకుంటూ వచ్చింది.

కాని భీమయ్య పెదతల్లి మాటమీద పెళ్ళిచేసుకుని, యీావేళ పెళ్ళాన్ని వెంటబెట్టుకుని రావడంతో, మళ్ళీ తన మనసులో ఎందుకో గందరగోళం బయలుదేరింది. అర్థం కాని ఆలోచనలు తలలెత్తాయి.

నల్లకలువలాంటి సీతాలు వాడి ప్రక్కన వుంటే, తన మనసులో ఏదో కోపం – సీతాలుమీద ద్వేషం పుట్టుకొచ్చాయి. ఇన్నాళ్ళూ తన చెప్పచేతల్లో కీలుబొమ్మలా పడివున్న భీమయ్య, వాడినుంచి తాను పొందదలచిన సుఖం యీావేళ పరాధీనమై పోయినట్లనిపించింది. అంతేకాకుండా వాడికీ సంసారం ఏర్పడింది. పిల్లా జల్లా కలుగుతారు, ఈ కమతం మీద మమకారం శ్రద్ధ తగ్గిపోతాయి. సంపాదనలో పడతాడు. సుఖం మరుగుతాడు. ఇంక భీమయ్య యిదివరకటి భీమయ్యలా వుండడు తన కమతానికి తనకి. యిలాంటి ఊహలన్నీ బంగారమ్మ మెదడులో ముసిరాయి.

అనుమానం పుట్టకే పోవాలికాని, పుట్టిన అనుమానం పెరిగిపోడానికి ఎంతోకాలం అవసరంలేదు. కొత్తగా పెళ్ళయినవాడు కావడంతో పొలం కాస్త ఎండెక్కాక వెళ్ళేవాడు భీమయ్య. ఎంత రాత్రయినా, గొడ్లసావిట్లో గొడ్డులా పడుండటం మానేసి మాలపల్లిలోకి పోయి సీతాలుతోటే పడుండేవాడు. వాడిమీద అనుమానాలను పెంచుకొని, చిన్న పాలేరు మరిడయ్యను వాడిమీద నిఘావేసింది బంగారమ్మ. అదను చూసుకొని, చిన్న పాలేరు, వూళ్ళోవాళ్ళు అభాండాలు దొర్లించారు. భీమయ్య తన

కమతం మీద నుంచి సొమ్ము చేసుకుంటున్నాడన్న చెప్పుడు మాటల్ని సులువుగా నమ్మింది.

దాంతో యిదవరకిటిలా భీమయ్యని మెచ్చుకోవడం తగ్గించింది బంగారమ్మ. సూటీపోటీ మాటలు విసరడం మొదలెట్టింది. ఆమె అనుమానం బలపడ్డానికి, వూళ్ళోవాళ్ళ మాటకి విలువ ఏర్పడ్డం కోసం అన్నట్లు, సీతాలు సంపాదనతో గుడిశ బాగుచేసుకున్నారు యిద్దరూ. పట్టెమంచం కొనుక్కున్నారు వాళ్ళు. సీతాలు ముచ్చటకోసమని, భీమయ్య అప్పుడప్పుడు తెల్ల చొక్కా తొడుక్కోడం మొదలెట్టాడు.

దాంతో తన కమతాన్ని భీమయ్య మింగేస్తున్నాడనుకుంది బంగారమ్మ. కాని ముఖా ముఖీని వాడితో తగవు పెట్టుకోలేదు. తగవు పెట్టుకుని వాడిని దూరం చేసుకుంటే, ఆమాత్రం ఆసరా కూడా దొరకదని బంగారమ్మకి బాగా తెలుసు.

సీతాలు కారణంగా వాడు తనకి దూరమై పోతున్నాడే అన్న బాధతో లేనిపోని అనుమానాలు వాడిపై పెంచుకుని మానసికంగా మరీ దూరం చేసుకుంటోంది బంగారమ్మ భీమయ్యని. అలా ఒక ఏడాది గడిచింది. కాని భీమయ్య వెనుక బంగారమ్మకి ఎంత దగ్గరలో వున్నాడో యిప్పుడూ అంతే. చిన్నతనం నుంచీ ఛీత్కారాలకి, యీసడింపులకి అలవాటుపడ్డ భీమయ్యకి బంగారమ్మ సూటీపోటీ మాటలు అంత నొప్పనిపించలేదు. అందుకే వాడు ఎప్పటిలాగే వాడి పని చేసుకుపోతున్నాడు.

ఓ రోజున పెరట్లో సపోటా చెట్టుకాడ నిలబడి 'కాసింత పుల్లని పచ్చడేదేనా యిప్పించండమ్మగోరా' అన్నాడు భీమయ్య.

'యేం? పులుపుమీద మనసయ్యిందా' అంది వెటకారంగా బంగారమ్మ.

'కాదండా. సీతాలు నీళ్లోసుకున్నాదండా?' అన్నాడు సిగ్గుపడిపోతూ.

ఎండిపోయిన పాత చింతకాయ పచ్చడి, కొబ్బరి చిప్పలో పెట్టి యిచ్చింది వాడికి.

'సీతాలు నీళ్ళోసుకుందన్న మాట విన్న తరువాత తను అనుకున్నట్టే భీమయ్య తనకి యింకా దూరమై పోతున్నాడనుకుంది బంగారమ్మ, తన కొడుకు కోసం తనెంత తాపత్రయపడి ఆస్తిని పెంచుతోందో వాడూ వాడి సంతానం కోసం సంపాదించ మరుగుతాడు. తనకమతాన్ని వాడికోసం వాడుకుంటాడు. నిక్షేపంగా యీ కమతం కోసమే బతుకుతున్నట్టు బతికే వాడికి, బతుకు రుచి చూపించింది సీతాలు. సీతాలే వాడ్ని తనకి దూరం చేసింది. దీనికంతకీ కారణం సీతాలే' యిలా తనలోతను వూహించుకుంటూ సీతాలు మీద పీకలోతు కసి పెంచుకుంది బంగారమ్మ.

☆ ☆ ☆

ఆనాడు అట్లతదియ. అంతకు రెండు రోజులనుంచీ ముసురట్టింది. లేకపోతే అట్లతద్దినాడు వూళ్ళోని కన్నెపిల్లలందరూ రామాలయం పక్కనే వున్న చింతచెట్టుకి వుయ్యాల వేసుకొని పోటీలు పడి వూగుతూ వుండేవారీ పాటికి. అవి గేదెలు

యీనే రోజులు. చాలా గేదెలు ఆ ప్రాంతంలో ఉంద్రాళ్ళ తదియ అట్లతదియ మధ్య యీనుతూ వుంటాయి.

రాత్రి పది గంటలవేళకి, కూరగాయలు అమ్ముకొని పట్నం నుంచి తిరిగి వచ్చాడు భీమయ్య. బంగారమ్మకి డబ్బువప్పచెప్పి 'ఎల్లొత్తానండమ్మగోరా,' అన్నాడు.

'గొడ్ల సావిట్లోకెళ్ళి గేదెల్ని చూసావా?'

'ఏటట్టా అంటున్నారు?'

'మన వంకర కొమ్ములగేది యీనమోపుకొచ్చి నట్టుందిరా. మధ్యాహ్నం నుంచి సరిగ్గా గడ్డి ముట్టుకోడంలేదు. కట్రాటచుట్టూ తిరుగుతోంది. ఒకసారి చూసిరా?'

భీమయ్య గొడ్లసావిట్లోకెళ్ళి గేదెని చూసొచ్చాడు. అది యీనమోపు కొచ్చినమాట నిజమే. కట్రాటచుట్టూ అలంగం తిరుగుతోంది.

'నిజమేనండీ యీ మాపుకి యీనేత్త దనుకుంటాను!' అన్నాడు.

'మరి నువ్వు యింటికెళ్ళి వెచ్చగా పడుకుంటే దానిగతేంగాను, నీ చేతులతో నువ్వు పెంచిన గేదది. 'పుట్టిన దూడకి గోళ్ళు తీసేవాడు లేక, చూసేవాడులేక బంగారమ్మ గేది మాయతినేసింది. పాలివ్వడంలేదు.' అని వూళ్ళోవాళ్ళు చెప్పుకుంటే నీకు మాత్రం సిగ్గుచేటు కాదట్రా? నేనొంటరిదాన్ని నాకెవరున్నారింక?' అంది బంగారమ్మ వాడ్ని రెచ్చగొట్టి తన పబ్బం గడుపుకోవాలన్న ఆశతో.

'అదికాదండమ్మ గోరా? అవతల సీతాలు కూడా వట్టిమడిసి కాదు. పొద్దుటేలకే కాతంత బద్దకంగా వున్నాది. యిక దానకిమాత్రం ఎవరున్నారు సెప్పండక్కడ?' అన్నాడు భీమయ్య తను వెళ్ళక తప్పదన్న ధోరణిలో.

'అదేమిట్రా అలా అంటావు. ఊరుకాక మాలపల్లి అయితే మాత్రం, అంత అవుసరమైతే కబురే తేరా ఎవరూ? అడది కష్టపడుతూ వుంటే చూస్తూ వదిలేస్తారా? ఎవరో ఒకరు కబురు తెస్తే అప్పుడెదుదువు గానిలే. ముందు నోరులేని ఆ గేదె సంగతి చూడు' అంది బంగారమ్మ.

సీతాలు మీద కొండంత మమకారమున్నా బంగారమ్మ అన్నమాటలు సబవనిపించి, గొడ్ల సావిట్లోకి వెళ్ళి గేదె ఎప్పుడీనుతుందా; ఎప్పుడు యింటికి పోదామా అని ఎదురు చూస్తూ కూర్చున్నాడు భీమయ్య.

బంగారమ్మ ముందు మండువాలో వీధి గుమ్మానికి పక్కగా వున్న పడక గదిలో వెచ్చగా పడుకుంది. గేదె కట్రాట చుట్టూ నిలకడ లేకుండా అలంగం తిరుగుతోంది. భీమయ్య మనసు అస్థిమితంగా అటు సీతాలు గురించి, యిటు గేదె గురించి ఆరాటపడుతోంది.

రాత్రి పన్నెండు గంటలయింది. ఎవరో 'బంగోరమ్మ గోరా, బంగోరమ్మగోరా!' అని అరుస్తూ వీధి తలుపు తడుతున్నారు.

బంగారమ్మ రెండుమూడు కేకలు విన్న తరువాత లేచి, వీధి తలుపు తీసి, 'ఎవరే?' అంది.

"నేనేనండమ్మా! మరియమ్మని. భీమయ్య పెళ్ళాం కష్టపడతన్నాదండి. సంద టేలనుంచి పురుడు రావటంలేదు. అచారిగోరింటి కెడితే రెండు సిన్నాల

కత్తూరి మింగించమన్నారు. ఊళ్ళో ఒసిన్న మెత్తే దొరికినాది. భీమయ్య వుంటే ఏడకేనా యెల్లి యింకో సిన్నం తెత్తాడేమోనని వచ్చాను–దాని కాళ్ళు సల్లబడ్డాయి అమ్మగోరా. అంతా కంగారు పడతన్నారు మాలపల్లిలో, ఎవరికీ నిద్దర్లు లేవు మాపిటేలనుంచి" అని చెప్పింది మరియమ్మ గుక్కతిప్పకోకుండా.

"ఊళ్ళో వుంటె మాలపల్లిలోకి ఎందుకు రాడే. నేనిక్కడ కట్టేస్తానా. వాడి పెళ్ళానికి అవతల అలావుంటె పట్నానికి కూరలు అమ్ముకురాడానికెళ్ళాడు. ఏ సినిమానో చూస్తూ ఆగిపోయాడేమో రాత్రికి. రాగానే పంపుతాలే నువ్వెళ్ళు" అంది బంగారమ్మ.

మరియమ్మ వెళ్ళిపోయాక తలుపు వేసుకొని పడుకుంది బంగారమ్మ. భీమయ్యకీవార్త చెప్పనేలేదు. "సీతాలు అడ్డు తొలగిపోతే వాడు మళ్లీ తన మనిషి. తన కమతం కోసమే బలికే మనిషి అవుతాడు" అనుకుంది బంగారమ్మ.

"సీతాలు పీడ యీనాటితో విరగడైపోతుంది దేవుడు తనకి మేలుచేస్తే, (సీతాలుకి కీడుచేస్తే)" అనుకుంటూ నిశ్చింతగా నిద్రపోయింది.

అంతేకాని రాత్రి వాడికి కబురొచ్చిన సంగతి, ఆ విషయం వాడికి తను చెప్పని సంగతి వాడికి తెలిస్తే ఏమౌతుందన్న ఆలోచన రాలేదామెకి. అటువంటి పరిస్థితే వస్తే పదిమందిలో తనమాటే నెగ్గుతుందన్న నమ్మకం –కామోసు బంగారమ్మకి. అందుకే హాయిగా నిద్రపోగలిగింది.

తెల తెలవారుతోంది. పెరట్లో చింతచెట్టు మీది కాకులు గొంతు చించుకొని అరుస్తున్నాయి. భీమయ్యకి మాత్రం రాత్రంతా నిద్రాలేదు, మనశ్శాంతీ లేదు. కాని గేదె యీనలేదు. అలసిపోయి అదీ పడుకుంది.

బంగారమ్మ నిద్రలేచి కళ్ళు నలుపుక[illegible]టూ గొడ్ల సావిడి దగ్గరకొచ్చింది.

'యేరా, యీనలేదా గేదె?'

"లేదండమ్మగోరా! ఓపాలి యింటికెళ్ళొత్తానండి. అవతలదెల్లావున్నాదో? యింకాసేపట్లో సిన్నపాలేరొత్తాడు కదండీ. అవసరమైతే కబురంపండి?" అని చెప్పి మాలపల్లికి బయలుదేరాడు భీమయ్య.

భీమయ్య యించుమించు పరుగెత్తాడు. మాలపల్లి చేరుకున్నాడు. మాలపల్లెలోకి అడుగు పెడుతూ వుంటె గుండెలు కొట్టుకొంటున్నాయి వాడికి. "సీతాలు కెల్లావున్నాదో," అనుకున్నాడు.

గుడిశ దగ్గరయింది. గుడిశ ముందు జనం మూగారు. 'పురుడొచ్చేసిందేమో?' అనుకున్నాడు.

మరీ చేరువయ్యాడు గుడిశకి.

"సీతాలు నునల్ని వదిలి ఎల్లిపోయిందిరోయ్." అంటూ బావురుమంది ఓ ముసిలిది. ఏ సంబంధ బాంధవ్యాలూ లేకపోయినా అక్కడున్న నలుగురాడాళ్ళు ఏడిచారు.

"అరదరాతిరేల నీకోసరమని బంగారమ్మ గోరింటికొచ్చాను. నువ్వు పట్నానికెల్లావని, రాగానే పంపుతానని సెప్పింది. నువ్వు పట్టంనుంచి బేగా వచ్చినా సూపందేది.

యింకో సిన్న వెత్తు కత్తూరి దొరికినా బతికేది సీతాలు." అంది మరియమ్మ ఏడుపును ఆపుకుంటూ.

నిన్న అరదరేత్రేల నేను పట్టణంలో వున్నానా? ఇంకో సిన్న వెత్తు కత్తూరిలేక సీతాలు సచ్చిపోనాదా? అనుకున్నాడు తనలో తనే భీమయ్య. సీతాలు శవం పక్కనే కూర్చున్నాడు. బావురు మంటాడనుకున్నారంతా. కాని ఎందుకనో వాడికి - ఏడుపు పైకి రాలేదు. వళ్ళంతా వేడెక్కిపోయింది. నిద్రలేని కళ్ళు మరీ ఎర్రబడ్డాయి.

తనకీ బంగారమ్మన్నా, బంగారమ్మ కమతమన్నా ప్రాణంతో సమానం. అందుకే బంగారమ్మ తన ప్రాణమైన సీతాలును బలిగొంది అనిపించింది వాడికి.

పదేపదే 'లేనోడి పెళ్ళాంపాణం కన్న గొప్పోళ్ళగేదె పాణానికి యిలువెక్కువన్నమాట' అనుకున్నాడు.

సీతాలుకి అంత్యక్రియలు చేసి అరోజంతా గుడిశలోనే తిండిలేకుండా మంచం మీద బోర్లా పడుకున్నాడు. అంతా ఓదార్పు మాటలేవో చెబుతున్నారు. కాని వాడికవేవి వినపడటం లేదు. యిరుగు పొరుగువాళ్ళు కాస్త గంజేనా తాగమన్నారు కాని పచ్చి మంచినీళ్ళేనా ముట్టుకోలేదు. గుండెలు వుడికిపోతున్నాయి వాడికి.

బంగారమ్మ మీద పగ, కోపం రాబందుల్లా రెక్కలు విప్పుకుని వాడి గుండెల్లో విహరిస్తున్నాయి.

మరునాడు పొద్దున్నే దిగాలుపడి, దొడ్డి గుమ్మాన బంగారమ్మ యింట్లోకెళ్ళి, గొడ్లసావిడి దగ్గర నిలబడ్డాడు. గేదె యీనింది దూడ, గేదె క్షేమంగా వున్నాయి. చిన్న పాలేరు దగ్గరున్నాడు. పలకరింపుగా గేదె అరచింది. బంగారమ్మ కంటె నయం అనుకున్నాడు భీమయ్య.

బంగారమ్మ లోపలినుంచి వచ్చి ఒక్క క్షణం చలనం లేకుండా వుండిపోయింది, 'నాకు తెలిసిందిరా. సీతాలు నిన్ను దగాచేసి పోయిందట! నేనే నీకు కబురంపు దామనుకుంటున్నాను. యేం చేస్తాం. దేవుడు మంచి వాళ్ళని యీ భూమ్మీద బతకనివ్వడు. అయన్ని చూడు యాభై యేళ్ళైనా నిండకుండా ఎత్తుకుపోయాడు. నేనేం చేసాను చెప్పు. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగీ, నిలదొక్కుకు బతుకుతున్నాను.' అంటూ ఓదార్చబోయింది బంగారమ్మ.

కొంతమంది తెలివీ, మాట నేరుపు తోటి మనిషిని మోసగించడానికే వుపకరిస్తాయి కామోసన్నట్టు బుద్ధిగా విన్నాడు భీమయ్య బంగారమ్మ మాటల్ని.

కాని వాడు మనసులో అనుకున్నాడు.

'నీ మొగుడుకి యాభై యేళ్ళు నిండాక చావొచ్చింది. అప్పటికి సగంకాలం అనుభవించాడు. అన్ని సుఖాలు అనుభవించాడు. రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు, కాని నా సీతాలుకి యిరువై ఏళ్ళేనా నిండలేదు. అప్పుడే దానికి యీ భూమ్మీద నూకలు నిండుకున్నాయి. నీ మొగుడుకి మందులు తక్కువై, వైద్యంలేక చావు రాలేదు. కాని నా సీతాలుకి ఓసిన్నం కత్తూరి దొరికితే బతికేదట. ఏమైనా నువ్వే సంపేసేవు నా సీతాలుని, నువ్వే సంపేసావు' అనుకున్నాడు మనసులో.

"ఏడవకురా, ఏం చేస్తాం చెప్పు. సీతాలునంటె తెచ్చి నీకివ్వలేను గాని; యీ కమతం అంతా నీది. నేనుండగా నీకేలోటూ రానివ్వను. యేడేళ్ళ వయసునుంచి యీ కమతంలో పెరిగావట. నేకాపరాని కొచ్చినప్పటినుంచి నన్నంటి పెట్టుకున్నావు. అది మధ్యలో వచ్చింది. మధ్యలోనే పోయింది. యింక వున్నది చూసుకుని బతకాలిగాని దాంతోపాటే మనం పోలేముగా?" అని ఓదార్చింది బంగారమ్మ.

కళ్ళు తుడుచుకుని యింక 'అంతేనండి. పొలంపోయి వత్తానండి.' అని చెప్పి బయలుదేరాడు భీమయ్య.

తిండి తిని వెళ్ళమందామనుకుంది బంగారమ్మ. యింకెక్కడి కెడతాడులే! ఎప్పటికైనా దేనికైనా యింక యిక్కడికి రావలసిన వాడేగా. ఆకలైతే వాడే వస్తాడు అనుకొని వూరుకుంది.

భీమయ్య పొలం చేరుకున్నాడు. మకాంముందు పడివున్న తుమ్మదుంగమీద కూర్చున్నాడు. సాయంత్రం దాకా ఎవరితోనూ మాటామంతీ లేకుండా, ఎదురుగా గుబురుగా పెరిగివున్న చెరుకుతోటని చూస్తూ కూర్చున్నాడు. చేతిలో వున్న కత్తి మొనతో తుమ్మదుంగ మీద నాట్లు వేస్తూనే - వున్నాడు. నాట్లుపడినచోట దుంగరూపు చెడి బాగానలిగిపోయింది. గొగ్గి గొగ్గిగా తయారయ్యింది.

బంగారమ్మ మీద కసి, కోపం, పగ అతని నరనరాల్లోనూ లావాలా వుడుకుతున్నాయి. ఒకే ఆలోచన - పగ ఎలా తీర్చుకోవాలి? ఏం చేయాలి? ఏం చేయడానికీ పాలుపోలేదు వాడికి.

సందచీకటి కమ్ముకుంటోంది. చెరుకుతోటలోకి నడిచాడు. కొంత దూరం నడిచి చుట్టూ చూసుకున్నాడు. తనచేతులతో పెంచిన చెరుకుతోట తనకంటె యెత్తు పెరిగి, తననే జడిపిస్తుంది అనిపించిందివాడికి. కాస్త ముందుకు నడచాడు. ఒక చెరుకాకు చేతికి గీసుకుని రక్తం చిమ్మింది.

వాడికి పిచ్చికోపం వచ్చింది. తన చేతిలోని కత్తితో ఒక్కొక్క చెరుకుగడనే నరకడం మొదలెట్టాడు కసిగా. ప్రతి చెరుకు గడలోనూ బంగారమ్మ కనిపించింది. ఆమె మాటల తీపి స్రవించింది. చేతికందినంతమేర నరుక్కొంటూ పోయాడు.

కాని వాడి కసి, పగ చల్లారలేదు. కత్తినేలకేసి కొట్టి "దీని తల్లి సిగతరగ - యింకా దీనికాడ వూడిగం నాకెందుకు, నేనొక్కడ్నీ ఎల్లాగోలా బతుకుతాను." అనుకుని యెక్కడికో వెళ్ళిపోయాడు భీమయ్య.

పచ్చటి బంగారమ్మ కమతం ఎండు ముఖం పట్టింది.

★ ★ ★